క్లుప్తంగా

అందరి కృషితోనే అభివృద్ధి

మున్సిపల్ కమిషనర్ నాగేందర్


నాగేందర్

చేర్యాల(సిద్దిపేట): మున్సిపాలిటీ అభివృద్ధిలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని కమిషనర్ నాగేందర్ పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ నుంచి బదిలీపై వచ్చిన ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేర్యాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పరిశుభ్రత, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. అనంతరం ఆయనను కార్యాలయ సిబ్బంది శాలువాలతో సన్మానించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


విద్యార్థినులతో భోజనం చేస్తున్న అనిత

హుస్నాబాద్: విద్యార్థినులు భోజనంచేసే ముందు చేసిన తర్వాత చేతులు కడుక్కొని వ్యక్తిగత పరిశ్రుభతను పాటించాలని మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అయిలేని అనిత సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సోమవారం ఆమె సందర్శించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మానసిక, శారీరక దృఢత్వం గురించి బోధించారు. ప్రభుత్వం కల్పించే విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు.

'ప్రైవేట్'పై చర్యలు తీసుకోరూ..


మాట్లాడుతున్న ప్రశాంత్

దుబ్బాకటౌన్: గుర్తింపులేని ప్రైవేట్ విద్యాసంస్థలను తక్షణమే రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కొండ ప్రశాంత్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా సంస్థలను ఎత్తివేస్తూ, పలు ప్రైవేట్ సంస్థలకు అండగా ఉంటోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాకేశ్, యాదగిరి, రాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

నాయకత్వ లక్షణాలతోనే రాణింపు


విద్యార్థులతో మున్సిపల్ చైర్మన్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొంటే మరింత రాణిస్తారని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పేర్కొన్నారు. పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సుష్మ, కరస్పాండెంట్ సిస్టర్ జోసెఫ్ మేరీల ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యార్థి నాయకుల ఎన్నిక' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియోద్దీన్, ఉపాధ్యాయులు ఆరోగ్యమాత, సోనీప్రియ, వేళాంగిని, నర్సింహులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా అధ్యక్షుల నియామకం


నియామక పత్రం అందజేస్తున్న లక్ష్మి

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ మహిళా అధ్యక్షులను నియమించినట్టు జిల్లా అధ్యక్షురాలు ముద్దాం లక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కొమ్మూరి నివాసంలో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. మండల మహిళా అధ్యక్షురాలిగా రేకులపల్లి విజయలక్ష్మి, మహిళా అధ్యక్షురాలిగా వంగ జయప్రదలను నియమించినట్టు చెప్పారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలిగా దాసరి కళావతి, ప్రధాన కార్యదర్శిగా తోట్ల రాజేశ్వరి, జిల్లా సంయుక్త కార్యదర్శిగా నాగిళ్ల భాగ్యను నియమించామని తెలిపారు.


గజ్వేల్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి


హుస్నాబాద్: ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు

స్వచ్ఛత, శుభ్రతే లక్ష్యం

- ముమ్మరంగా నిర్వహించిన 'స్వచ్ఛదనం–పచ్చదనం' ర్యాలీలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

జిల్లాలోని గ్రామాలు, పట్టణాలలో స్వచ్ఛత, శుభ్రతే లక్ష్యంగా సోమవారం 'స్వచ్ఛదనం–పచ్చదనం' ర్యాలీలు ముమ్మరంగా నిర్వహించారు. మున్సిపల్ నేతలు, అధికారులు, స్థానిక నాయకులు, విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషిచేయాలి

– ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమంలో పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించి, పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛదనాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. అయిదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


చేర్యాల(సిద్దిపేట): ర్యాలీలో అధికారులు, విద్యార్థులు


నంగునూరు(సిద్దిపేట): అప్పలాయిచెరువులో..


వర్గల్(గజ్వేల్): మాట్లాడుతున్న ఎంపీడీఓ


కొమురవెల్లి(సిద్దిపేట): మాట్లాడుతున్న ఎంపీడీఓ


దుబ్బాకలో నిర్వహించిన అవగాహన ర్యాలీ


అక్కన్నపేట(హుస్నాబాద్): మల్లంపల్లి గ్రామంలో..


సిద్దిపేటఎడ్యుకేషన్: అటానమస్ కళాశాల మైదానంలో ..


సిద్దిపేటలో మున్సిపల్ చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు తదితరులు

మా భూములకు పట్టాలివ్వండి

- ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన
- మనోవేదనతో రైతు ఆత్మహత్యాయత్నం


దీక్ష చేస్తున్న దళిత రైతులు

హుస్నాబాద్‌రూరల్: ధరణి ద్వారా అధికారులు తమ పట్టాలను మరొకరి పేరున మార్చేశారని బాధిత రైతులు సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పోతారం(ఎస్) గడ్డలమీది పల్లెకు చెందిన తాము యాభైయేళ్ల నుంచి ఇండ్లు నిర్మించుకొని వ్యవసాయం చేసుకుంటున్నామన్నారు. అయితే ధరణి మోసాలకు బలైన తాము పాత రికార్డులను పరిశీలించి పట్టాలివ్వాలని గతంలో అధికారులకు విన్నవించామని, రెవెన్యూ అధికారులు విచారణ జరిపించి పంచనామా ఇచ్చారని చెప్పారు. అయితే ధరణి ఆపరేటర్ తప్పిదంవల్ల తహసీల్దార్ పట్టా మార్పిడి చేశారని వాపోయారు. కలెక్టర్ స్పందించి తమ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత రైతులు రాజేశ్, శంకర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం..

తన భూమి తనకు దక్కనే ఆవేశంలో ఓ బాధిత రైతు వేముగంటి వెంకటేశ్ పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నం చేశారు. పక్కనే ఉన్న రైతులు మందు డబ్బాను గుంజుకుని వెంటనే ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. దీనిపై తహసీల్దార్ రవీందర్‌రెడ్డిని వివరణ కోరగా బాధిత రైతులకు న్యాయం చేయాలనే ఆలోచనతోనే మోఖా పంచనామా చేయించామని, పంచనామా, సర్వే నివేదిక ఆధారంగా ఆర్డీకోకు పట్టాల రద్దుచేయాలని నివేదిక ఇచ్చానని చెప్పారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్


సమావేశంలో కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: జిల్లా కలెక్టర్లు, మండల రెవెన్యూ, భూ–సర్వే అధికారులతో సోమవారం హెచ్ఎండీఏ చైర్మన్ సర్ఫరాజ్ అహ్మద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని మర్కుక్, ములుగు, వర్గల్ మండలాల్లో ఉన్న చెరువులు, కుంటలకు సంబంధించిన విస్తీర్ణంపై ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్, ఏడీ సర్వేలాండ్ వినయ్ కుమార్, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రెహమాన్, ఆయా మండల తహసీల్దార్లు, సర్వేయర్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిచేకూర్చనున్న సీఎం

బెజ్జంకి(సిద్దిపేట): సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డినెన్స్ ద్వారా లబ్ధి చేకూరుస్తారని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆయనకు మండల మాదిగ నాయకులు సోమవారం బెజ్జంకి క్రాసింగ్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షల్లోను రిజర్వేషన్‌లు అమలు చేసేందుకు సీఎం కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి పరామర్శ

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం పలువురి బాధిత కుటుంబాలను పరామర్శించారు. పట్టణ కేంద్రానికి చెందిన మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి తల్లి పుర్మ రాధమ్మ శనివారం మృతి చెందడంతో ఈ విషయం తెలుసుకున్న ఆయన ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లేశం, ఎల్లారెడ్డి, చందు, దాసు, పర్వతాలు, శ్రీనివాస్, అంజయ్య, మధు, భిక్షపతి, రాము తదితరులున్నారు. అనంతరం కుడి చెరువును సందర్శించి చేపట్టాల్సిన మరమ్మతుల గురించి ఐబీ అధికారులు, తహసీల్దార్‌తో మాట్లాడారు. అలాగే స్థానిక కౌన్సిలర్ గోలు చంటి ఇంటికి వెళ్లి దశదిన కర్మలో పాల్గొన్నారు.


ఆగంరెడ్డి ఇంటివద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సంక్షిప్త వార్తలు

◆ ఉపాధ్యాయులకు సన్మానం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని చెప్యాల ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఆకుల మల్లేశంను సహోపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే పాఠశాలకు ప్రమోషన్‌పై వచ్చిన రాజుకు స్వాగతం పలికారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, లోకేశ్వర్, చంద్రశేఖర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు ఆర్థిక సాయం

నంగునూరు(సిద్దిపేట): పది జీపీఏ సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒక్కరు చక్కగా చదివి ప్రయోజకులు కావాలని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాదగోని చక్రధర్‌గౌడ్ సూచించారు. పదో తరగతి పరీక్షల్లో పది జీపీఏ సాధించిన 22మంది విద్యార్థులకు సోమవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. హెచ్ఎం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ ముదిరాజులను బీసీ ఏకి మార్చాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ కోరారు. సోమవారం చిన్నకోడూరులో నిరసన వ్యక్తంచేసి తహసీల్దార్ జయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ధర్మ, నాగేందర్, ఆనందం, దేవయ్య, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ టై, బెల్ట్‌ల పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపెల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గ్రామంలోని ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రూ.15వేలు విలువచేసే టై, బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, హెచ్ఎం, ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు, పాల్గొన్నారు.

◆ పీఆర్‌టీయూకు రాజీనామా

వర్గల్(గజ్వేల్): ఎస్‌జీటీల సమస్యలు పట్టించుకోవడం లేదని పేర్కొంటూ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వర్గల్ మండలం గుంటిపల్లి స్కూల్ ఉపాధ్యాయుడు ఓ.శ్రీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శిగా ఉన్న వేలూరు పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.సుధాకర్ సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌జీటీల సమస్యలపై నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్న కారణంగా తాము పీఆర్‌టీయూ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, ఎస్‌జీటీయూలో చేరుతున్నట్లు ప్రకటించారు.

◆ తల్లిపాలు బిడ్డకు అమృతం

అక్కన్నపేట(హుస్నాబాద్): తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటివని సూపర్‌వైజర్ సుజాత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కపూర్‌నాయక్‌తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రజలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీచర్ రమాదేవి, కార్యదర్శి అనూష, మాజీ ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిగా రాజేందర్

చేర్యాల(సిద్దిపేట): మెదక్ పార్లమెంట్ ఎమ్మార్పీఎస్ టీఎస్ ఇన్‌చార్జిగా భూమిగారి రాజేందర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లాలకు పార్లమెంట్ స్థాయి ఇన్‌చార్జిల నియామకం చేపట్టారు. రాజేందర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానన్నారు.

◆ ఈఎస్ఐ కార్డులివ్వండి



జగదేవ్‌పూర్(గజ్వేల్): భవన నిర్మాణ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని బీఎస్ఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతి కోరారు. సోమవారం సంఘం 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని మునిగడప, తిగుల్‌నర్సాపూర్, మందాపూర్, పలుగుగడ్డ గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించాలన్నారు.

◆ అన్నదాన వితరణ

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో శ్రావణ మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని ఆర్య వైశ్య మహిళా విభాగం, ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి కొండపాక మండల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 300మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు. ప్రతీ సోమవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని సంఘం సభ్యులు తెలిపారు.

పొటాషియంతో ఎన్నో ప్రయోజనాలు

- ఏఈఓ శ్రీలత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని జనగామ గ్రామంలో వరిసాగుపై రైతులకు వ్యవసాయ విస్తరణాధికారి శ్రీలత క్షేత్ర ప్రదర్శనద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరినాట్లు వేస్తున్న ఒద్దిరాల రాజు అనే రైతు పొలాన్ని పరిశీలించారు. నేలలో పొటాషియం, భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నారుమడిలో కేఎస్‌బీ వాడకాన్ని స్వయంగా చేసి చూపించామన్నారు. ఒక కిలో విత్తనానికి 5మి.లీ కె.పవర్‌ను సమానంగా పట్టించి అరబెట్టి విత్తుకోవాలని, లేదా 100మిల్లీలీటర్ల కేఎస్‌బీ ద్రావణాన్ని 30లీటర్ల నీటిలో కలిపి ఆ ద్రావణంలో నారు మునిగేటట్లు 10నిమిషాలు ఉంచిన తర్వాత నాటుకోవాలని సూచించారు. అధిక శాతం పొటాషియం మొక్కలకు అందుబాటులో ఉండదని దీనివాడకం వల్ల పొటాషియం కలిగిన ఖనిజాలను కరిగిస్తుందని చెప్పారు.


మాట్లాడుతున్న ఏఈఓ శ్రీలత

డిక్లరేషన్‌కు నిధులు కేటాయించాలి

- బీజేపీ ఎస్సీ మోర్చా శివకుమార్

గజ్వేల్‌రూరల్/దుబ్బాకటౌన్/కోహెడ(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను కేటాయించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల చేవెళ్లలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలైన అంబేడ్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు, షెడ్యూల్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునఃనిర్మాణం వంటి వాటికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాములు, మధుసూదన్, శేఖర్, శ్రీనివాస్, సుమతి తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకటౌన్‌లో దళిత మోర్చా మున్సిపల్ అధ్యక్షుడు కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాబు, రాజు, కనకయ్య, యాదగిరి పాల్గొన్నారు. కోహెడలో దళిత మోర్చా మండలాధ్యక్షుడు దావా శేఖర్ నేతృత్వంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, ఐలయ్య, శివకుమార్, రమేశ్, సాగర్, సుమన్, రాజు తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లిలో బచ్చలి రాజు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కనకయ్య, శివారెడ్డి, కరుణాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్‌లో వినతిపత్రం అందజేస్తున్న నేతలు

సుప్రీంకోర్టు తీర్పు న్యాయబద్ధంగా లేదు


నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ నాయకులు

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

సిద్దిపేటరూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా లేదని, తీర్పును సుప్రీంకోర్టు 11మంది న్యాయమూర్తుల ధర్మాసనానికి పంపించి పునఃపరిశీలించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు కలెక్టరేట్‌ను ముట్టడించి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పును పరిశీలించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు మద్దెల నర్సింహులు, ఎలుక దేవయ్య, ర్యాకం శ్రీరాములు, సత్తయ్య, రాజు, నర్సింగరావు, కో కన్వీనర్లు ఎల్లేశ్, శంకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ బాక్స్‌ల దొంగలకు రిమాండ్

ములుగు(గజ్వేల్): సెంట్రింగ్ బాక్స్‌లు దొంగిలించిన ఆరుగురిని అరెస్టుచేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ పి.మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిందితుల నుంచి 68సెంట్రింగ్ బాక్స్‌లు, ఒక స్విఫ్ట్ కారు, ఆటో, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పూడూరుకు చెందిన పిట్ల మల్లేశ్, నర్సింగరావు, మిరుదొడ్డి భూమేశ్, ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ అశ్రఫ్, మెదక్ జిల్లా చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన కొమ్మరి రాజు, కర్ణాటకలోని సంకలపురానికి చెందిన రమేశ్ కలసి మే 20న ములుగు మండలం అచ్చాయిపల్లి శివారులో ఉన్న ఓ ఆటోను ఎత్తుకెళ్లారు. అలాగే జులై 26న గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్దకు రాత్రి సమయంలో వెళ్లి సెంట్రింగ్ బాక్స్‌లను దొంగిలించారు. ఈ ఘటనపై ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో నిందితులను సోమవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయనతో పాటు ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ ఉన్నారు.


వివరాలు తెలియజేస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

'పంచాయతీ'కి మోక్షం ఎప్పుడు?

మండలంలోని కొట్యాల పంచాయతీ నూతన భవన నిర్మాణం ప్రారంభ దశలోనే నిలిచిపోయాయి. పనులు ప్రారంభమై ఏడాది పూర్తవుతున్నా ఇంకా గుంతలకే పరిమితమైంది. పాఠశాల ఆవరణలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా మొదటి విడతగా రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పిల్లర్ల కోసం గుంతలు తీశాడు. కాని అంతలోనే అధికారులు ఆ నిధులను వేరే దానికి మళ్లించారు. ఆ తరువాత గడా నిధులద్వారా రూ.20లక్షలు మంజూరయ్యాయి. పనులకు సంబంధించిన అగ్రిమెంట్‌తోపాటు టెండర్ పూర్తయి ఎనిమిది నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. త్వరగా పూర్తిచేసి పంచాయతీ భవనాన్ని అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పిల్లర్ల కోసం తీసిన గుంతలు

– ములుగు(గజ్వేల్)